వైఎస్ఆర్
కడప
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 22 మే 2026

## కడప పర్యటనకు నారా లోకేష్

జమ్మలమడుగు, మే 21, ప్రభాతవార్త:



తెదేపా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి నారా లోకేష్ కడప జిల్లా పర్యటన సందర్భంగా కడప ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మంత్రివర్యులు సవితమ్మను కడప జిల్లా తెదేపా అధ్యక్షులు భూపేష్ సుబ్బరామిరెడ్డి, శాసనసభ్యులు చైతన్యరెడ్డి, పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవీంద్రారెడ్డి, తెదేపా జాతీయ ఉపాధ్యక్షులు హరిప్రసాద్‌లు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. 2 రోజుల జిల్లా పర్యటనకు వచ్చినన నారా లోకేష్‌ను కడప విమానాశ్రయం నందు తెదేపా అధ్యక్షులు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

## మంత్రి నారా లోకేష్‌ను కలిసిన జగన్ రాజు

రాజంపేట, మే 21 ప్రభాతవార్త



జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబు కడప విమానాశ్రయంలో టిడిపి అసెంబ్లీ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. విమానాశ్రయంలో మంత్రికి రాజు ఘన స్వాగతం పలికారు.రాజంపేట అభివృద్ధికి సంబంధించి పలు విషయాలపై మంత్రితో జగన్ మోహన్ రాజు మాట్లాడారు. అలాగే లోకేష్ పర్యటన కోసం జిల్లాకు వచ్చిన బండి సవితాను కడప ఆర్ అండ్ బి అతిథి గృహంలో జగన్ రాజు కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పలు విషయాలపై చర్చించారు.

# మంత్రి లోకేష్‌కు ఘనస్వాగతం





కడప మే 21 ప్రభాతవార్త:

రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం సాయంత్రం కడప విమానాశ్రయమునకు చేరుకున్న రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా నేతలను మంత్రి లోకేష్ పేరుపేరునా పలకరించారు. వారి నుంచి వినతులను స్వీకరించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ప్రభుత్వ విప్, కడప శాసన సభ్యురాలు రెడ్డప్ప గారి మాధవి రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధిమీనా, రాజం పేట సబ్ కలెక్టర్ భావన, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం శాసనసభ్యులు నంద్యాల వరదరాజుల రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, యోగివేమన విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్, డిసిసి బి బ్యాంక్ చైర్మన్ సూర్య నారాయణ, డిసిఎంఎస్ చైర్మన్ జయప్రకాష్, ఎఫ్ సిఒఎఫ్ చైర్మన్ యాదగిరి రామ్ ప్రసాద్, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్, ఆర్‌డిఓ మురళీ, డిఈఓ శంషుద్దీన్, సమగ్ర శిక్ష ఏపీసి అనురాధ, టిడిపి జిల్లా అధ్యక్షులు భూపేష్ రెడ్డి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు హరిప్రసాద్, అనంతపురం హిందూపురం జోనల్ కోఆర్డినేటర్ రెడ్డప్ప గారి శ్రీనివాసులు రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పుత్తా నరసింహా రెడ్డి, రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జి జగన్మోహన్ రాజు, పులివెందుల నియోజకవర్గం ఇంచార్జ్ బీటెక్ రవి, బద్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ రితేష్ కుమార్ రెడ్డి, పార్టీ నాయకులు గోవర్ధన్ రెడ్డి, పార్టీ నగర అధ్యక్షులు మన్సూర్ అలీ ఖాన్, అమీర్ బాబు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు తదితరులు ఘన స్వాగతం పలికారు.కార్యకర్తల సమావేశానికి భారీ భద్రత..కడప నగర చివారులోని రాజరాజేశ్వరి కళ్యాణ మండప సమీపంలో నిర్వహించిన నాయకులు, కార్యకర్తల సమన్వయ సమావేశానికి జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పోలీస్ అధికారులకు ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. పలు సూచనలు చేస్తూ దగ్గరుండి పర్యవేక్షి ంచారు. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్. సుధాకర్, కడప ఇంచార్జ్ డీఎస్పీ ఇ. బాలస్వామి రెడ్డి, ఎఆర్ డీఎస్పీ పి.నాగేశ్వర రావు, తదితరులు ఉన్నారు.











# కడప నేలలో ఊబికొస్తున్న ఆశలు

### జలధార వరప్రసాదంగా మారింది

### ఉపాధి హామీ నిధుల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం



చింతకొమ్మ దిన్నె మండలం బూసిరెడ్డిపల్లి పంచాయతీలో వేగంగా బాలుపల్లి చెరువు పనులుజిల్లాలో జలధాం కార్యక్రమం ఒక విప్లవాత్మక మార్పుకు శ్రీకారం చుట్టింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సమన్వయంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం, జిల్లాలోని భూగర్భ జల మట్టాలను పెంచడమే కాకుండా, వేలాది మంది కూలీలకు ఉపాధి కల్పిస్తోంది. ఇందులో భాగంగా బూసిరెడ్డి పంచాయతీలో వేగంగా బాలుపల్లి చెరువు పనులు జరుగుతున్నాయి. కడప నేలలో ఉబికి వస్తున్న ఆశలువర్షాభావ పరిస్థితులను అధిగమించడానికి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడానికి జలధార ఒక వరప్రసాదంగా మారింది. అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పనులు పండుగలా సాగుతున్నాయి.జిల్లా యంత్రాంగం మైక్రో లెవల్ ప్లానింగ్‌తో ప్రతి గ్రామంలోనూ నీటి సంరక్షణ నిర్మాణాలపై దృష్టి సారించింది. అందులో భాగంగా జిల్లాలో వేలాది సంఖ్యలో ఫాం పాండ్లు (పంటకుంటలు), ఊట చెరువుల పూడికతీత పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.వర్షపు నీరు వృథాగా పోకుండా, కొండ వాలు ప్రాంతాల్లో సి.సి.టి పనులు చేపట్టడం వల్ల భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతున్నాయిఎన్.ఆర్.ఈ.జి.ఎస్ ద్వారా వేసవి కాలంలోనూ వేలాది మంది వలస వెళ్లకుండా సొంత ఊర్లోనే ఉపాధి పొందుతున్నారు.“జలధార కార్యక్రమం వల్ల జిల్లాలో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయి:..గతంతో పోలిస్తే జిల్లాలోని అనేక మండలాల్లో బోర్లలో నీటి మట్టం పెరిగింది. నీటి లభ్యత పెరగడంతో రైతులు ఆశావహ దృక్పథంతో పంటలు సాగు చేస్తున్నారు. ముఖ్యంగా ఉద్యానవన పంటలకు ఈ పథకం ప్రాణవాయువుగా మారింది. ఉపాధి హామీ నిధుల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమైంది. కూలీల ఖాతాల్లోకి నేరుగా నగదు జమ అవుతుండటంతో వారి జీవన ప్రమాణాలు పెరిగాయి.“జలధార కేవలం ఒక పథకం కాదు, జిల్లా భవిష్యత్తుకు భరోసా. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు అందిపుచ్చుకోవడం వల్ల కడప జిల్లా జలసిరితో కళకళలాడుతోంది.“రాష్ట్ర ప్రభుత్వ పట్టుదల, అధికారుల నిరంతర పర్యవేక్షణ,ప్రజల భాగస్వామ్యం వెరసి కడప జిల్లాలో జలధార ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ పనులు రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఉపాధి హామీ పనుల ద్వారా పచ్చదనం పెరగడమే కాకుండా, రాబోయే తరాలకు జలనిధిని అందించే దిశగా అడుగులు వేస్తోంది... జలధార ఉపాధి హామీ పనులపై లబ్ధిదారుల స్పందన..ఈ పనుల వల్ల తమకు ఎదురవుతున్న ప్రయోజనాలపై స్థానిక కూలీలు రైతులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు



జలధార పనుల వల్ల మాకు చాలా ఆనందంగా ఉంది. ఈ చెరువు అభివృద్ధి చెందడం వల్ల మా జీవాలకు (గొర్రెలు, మేకలు, పశువులు) నీటి వసతి బాగా దొరుకుతుంది. అంతేకాకుండా, చెరువులో నీరు నిలవడం వల్ల మా పొలాల భూగర్భ జలమట్టం పెరిగి బావుల్లో నీరు సమృద్ధిగా ఉంటుంది. మూడు పల్లెల రైతులకు ఇది ఎంతో మేలు చేస్తుంది.

**నారాయణ రెడ్డి (బాలుపల్లె)“**



“ఉపాధి హామీ పథకం ద్వారా మాకు పనులు కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు. చెరువులో కంప కొట్టడం, గుంతలు తీయడం వంటి పనుల వల్ల వర్షపు నీరు నిలిచి, భూగర్భ జలాలు పెరుగుతాయి. దీనివల్ల బాలపల్లె, గోపనపల్లి, అపరాసుపల్లి గ్రామాల్లోని వ్యవసాయానికి, పశువుల దాహార్తికి ఎంతో ఉపయోగకరంగా ఉంది. మాకు కూలీ డబ్బులు కూడా సక్రమంగా అందుతున్నాయి. **ఆమని (గోపనపల్లి**



ఈ పథకం కింద పది ఊర్ల ప్రజలకు కలిగే విధంగా నీటి సౌకర్యం మెరుగుపడుతోంది. చెరువు కింద పనులు చేయడం వల్ల నీటి నిల్వ సామర్థం పెరుగుతుంది. ఇది మా భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తుందని భావిస్తున్నాము. **చంద్రకాంత మహేశ్వర (అపరాసుపల్లి)**



మేము ప్రతిరోజూ ఉపాధి హామీ పనులకు వస్తున్నాము. ఇక్కడ ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్స్ వంటి పనులు చేయడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. బోర్లలో, మోటార్లలో నీరు బాగా వస్తోంది, దీనివల్ల మేము పంటలు బాగా పండించుకోగలుగుతున్నాము. పశువులకు కూడా నీరు అందుబాటులో ఉంటోంది.“

**లక్ష్మీదేవి (ఉపాధి కూలీ)“**

### కాలువల్లో పూడిక తీత

# అడ్డంకులు లేకుండా సరిచేయాలి





మైదుకూరు, మే 21, ప్రభాతవార్త:

పట్టణ పురపాలక సంఘం పరిధిలోని డ్రైనేజీ సైడ్ కాలువలు పూడికతీత పనుల్లో జెసిపి వినియోగంతో చేపడుతున్న పనులు ఒక క్రమ పద్ధతిలో చేపట్టడం లేదని పట్టణ వ్యాపార షాపుల యజమానులు, గృ హ నిర్మాణ కుటుంబ సభ్యులు వాపోతున్నారు. పూడికతీత పనుల్లో మున్సిపాలిటీ పర్యవేక్షణతో చేపట్టిన అక్కడక్కడ త్రాగునీటి పైపులు, చిన్నవి, పెద్దవి, ఉండడంతో పూడికతీత ఎక్కువ ఉండడం వల్ల ఈ పైపులు పగిలి పట్టణవాసులకు కలుషిత నీరు జరిగి గత వారం రోజుల నుండి కడప రోడ్డు 8వ వార్డు, 9వ వార్డులో ప్రజలకు ఇబ్బందులకు గురి అవుతున్నారు. అలా కాకుండా సరైన పద్ధతిలో మున్సిపాలిటీ ఇంజనీరింగ్ మరియు శానిటేషన్ అధికారులు ఈ పనులను పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా కాలువలు పూడికతీతలో గోడ నిర్మాణాలు దెబ్బ తినకుండా గత మూడు సంవత్సరాలుగా పూడికతీత చేపట్టకపోవడంతో పెద్ద ఎత్తున కాలువలు పూర్తిస్థాయిలో మురికి నీరు పారకుండా కాలువ నిండా వ్యర్థ పదార్థాలతో నిండిపోయిన వ్యర్థాలను క్రమ పద్ధతిలో తొలగించి వచ్చే వర్షాకాలానికి పూర్తిస్థాయిలో కాలువలో నీరు పారేలా అధికారుల పర్యవేక్షణలో చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు. అంతేకాకుండా మున్సిపాలిటీ పరిధిలో సైడ్ కాలువల (డ్రైనేజీ) పూడిక తీత పనుల్లో మురుగు నీటి సజావు ప్రవాహానికి కాలువల పూడికను తీసేటప్పుడు త్రాగునీటి పైపులు, కాలువ నిర్మాణ కట్టుడు రాళ్లకు నష్టం జరగకుండా జాగ్రత్త పడాలి. కాలువల నుండి తీసిన పూడికను (మట్టి, ప్లాస్టిక్ వ్యర్థాలు తదితర) కాలువ గట్టున ఎక్కువ కాలం నిల్వ ఉంచకూడదు, దుర్వాసన రాకుండా, దోమలు వృద్ధి చెందకుండా మున్సిపల్ వాహనాల ద్వారా తరలించాలి. నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా పూడిక తీత సమయంలో కాలువల్లో అడ్డంకులు లేకుండా అడుగు భాగాన్ని సరిచేయాలి. ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు కాలువల్లో పడకుండా తగు జాగ్రత్తలతో ప్రజలకు హెచ్చరికలు చేయాలి. పూడిక తీసిన తర్వాత బ్యాక్టీరియా, దోమల లార్వాలను నాశనం చేయడానికి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ మరియు ఫినాయిల్ చల్లాలి. సాధారణంగా పురపాలక సంఘం పరిధిలోని ఇంజనీరింగ్ మరియు శానిటేషన్ అధికారులు ఈ పనులను పర్యవేక్షించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

### కోనేటికాల్వవీధిలో యువకుడిపై

# ఇద్దరు వ్యక్తులు దాడి

ప్రొద్దుటూరు క్రైం, మే 21, ప్రభాతవార్త:



కోనేటికాల్వ వీధిలో షేక్ అఫ్జల్ అనే యువకుడిపై అదే వీధికి చెందిన యూసుఫ్ మరియు హుసేన్ లు సిమెంటు ఇటుకలతో తలపై కొట్టడంతో రక్తగాయాలు అయ్యాయి. అఫ్జల్ పిన్ని కుమారుడిని యూసఫ్ అనే వ్యక్తి తన ఇంటి వద్ద చిన్న పని ఉందని బలవంతంగా పిలుచుకొనిపోయాడని అంతట అఫ్జల్ కుటుంబ సభ్యులు ఆ పిల్లవాడి ఆచూకీ కోసం వెతకగా యూసఫ్ పిలుచుకుపోయాడని తెలిసి అతన్ని ఎందుకు తమ పిల్లవాడిని తీసుకెళ్లావని అడిగినందుకు యూసఫ్ మరియు అతని సోదరుడు హుసేన్ ఇద్దరూ దాడి చేసి అఫ్జల్‌ను గాయపరచడం జరిగింది. దీనికి సంబంధించి ప్రొద్దుటూరు వన్‌టౌన్ పీఎస్ నందు ఎస్సై మధుసూదన్‌రెడ్డి కేసు నమోదు చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.

## హత్యరాల అపరకర్మ భవనానికి జగన్ రాజు శంకుస్థాపన

రాజంపేట, మే 21 ప్రభాతవార్త

శ్రీ కామాక్షి సమేత త్రేతేశ్వర స్వామిఆలయ సమీపంలో జగద్గురు అద్వైత సమితి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన హిందూ సనాతన ధర్మ సంస్కార అపరకర్మ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ జగన్‌మోహన్‌రాజు హాజరై శంకుస్థాపన చేశారు. సనాతన ధర్మ సాంప్రదాయాలను కాపాడేందుకు, స్థానికులకు ఉపయోగపడేలా ఈ భవనాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. శంకుస్థాపన అనంతరం చమర్తి జగన్మోహన్ రాజు పార్టీ నాయకులు, కార్యకర్తలు తో కలిసి హత్యారాల క్షేత్రంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. క్షేత్రంలోని శ్రీ కామాక్షి సమేత త్రేశ్వర్ స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు, సిద్దవటం కోర్టు ఏజీపీ గాదే ఆదినారాయణ, రాజంపేట మండలాధ్యక్షుడు మేడికొండ రవికుమార్ నాయుడు, సింగిల్ విండో డైరెక్టర్ ముల్లగూరి సుబ్రహ్మణ్యం నాయుడు, అత్తిరాల ఆలయ చైర్మన్ పూల నరసింహులు, సీనియర్ నాయకులు కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు, అప్పా రాజుపేట గ్రామాధ్యక్షుడు కృష్ణయ్య, వరదయ్యగారిపల్లె సర్పంచ్ హరి పాల్గొన్నారు.

# ప్రతి వాహనదారుడికి లైసెన్స్ తప్పనిసరి

### ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



వేంపల్లె మే 21 ప్రభాతవార్త

వాహనదారులు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ టి. నరసింహులు హెచ్చరించారు. గురువారం స్థానిక పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో సీఐ వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నరసింహులు మాట్లాడుతూ, వాహన పత్రాలు, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించి నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం ప్రమాదకరమని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది కిరణ్ కుమార్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లోకేష్ పర్యటన ప్రాంతాలను పరిశీలించిన డిఎస్‌పి

ముద్దనూరు,మే 21 ప్రభాతవార్త:

రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు శుక్రవారం మండల పరిధిలోని పెనికలపాడు గ్రామం, కొత్తపల్లి గ్రామపంచాయతీలోని రైతు మునగాల ద్వారకానాధ రెడ్డి ప్రకృతి వ్యవసాయ కేంద్రాన్ని సందర్శిస్తున్న సందర్భంగా జమ్మలమడుగు డిఎస్పి వెంకటేశ్వరరావు భద్రతా ఏర్పాట్లను గురువారం పరి శీలించారు. పర్యటనలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు వివరిం చారు. సిబ్బంది అప్రమత్తంగా మెలిగి ప్రశాంత వాతావరణంలో పర్యటన జరిగే విధంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ నగేష్ బాబు ఎర్రగుంట్ల సీఐ విశ్వనాథరెడ్డి ఎస్సైలు పోలీసులు పాల్గొన్నారు.





## భూమిరెడ్డి సురేంద్ర రెడ్డికి సన్మానం



బద్వేలు అర్బన్ మే 21 ప్రభాతవార్త :
స్థానిక మండలం కొండాపురం గ్రామానికి చెందిన భూమిరెడ్డి నారాయణరెడ్డి వెంకటసుబ్బమ్మ దంపతుల ద్వితీయ కుమారుడు భూమిరెడ్డి సురేంద్ర రెడ్డి కస్టమ్స్ డిపార్ట్మెంట్లో ఉద్యోగిగా ఎన్నికైన సందర్భంగా బేస్తవారం తన నివాసం లో రెడ్డి సంఘం నాయకులు పెద్దిరెడ్డి చేన్న కృష్ణారెడ్డి, బాదిరెడ్డి వెంకటరామి రెడ్డి, గోనుగుంట వెంకటసుబ్బారెడ్డి, అఖిలభారత రెడ్డి సంఘం రాష్ట్ర ఉపాధ్య క్షులు నాగేళ్ల వెంకటసుబ్బారెడ్డి, బోవిల్ల నందగోపాల్ రెడ్డి, కత్తెరపల్లె శ్రీనివాసు లురెడ్డి, గంగసాని వేణుగోపాల్‌రెడ్డి, అఖిలభారత రెడ్డి సంఘం జిల్లా మీడియా ఇన్చార్జి, కాస నరసింహారెడ్డి సత్కరించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడు తూ సురేంద్ర రెడ్డి కస్టమ్స్ ఆఫీసర్‌గా ఎన్నిక కావడంపట్ల వారు తమ సంతో షాన్ని వ్యక్తం చేశారు, సురేందర్ రెడ్డి భవిష్యత్తులో మంచి ఉన్నత స్థానానికి చేరుకోవాలని వారు ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో నాగటుబుల్‌రెడ్డి, గాజు లపల్లె సుబ్బారెడ్డి, జి రామమోహన్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామలింగారెడ్డి, సుధా కర్ రెడ్డి, బి రఘురాం రెడ్డి, రిటైర్డ్ మిలిటరీ, వై శివశంకర్ రెడ్డి, వారి తల్లిదం డ్రులు, కుటుంబ సభ్యులు బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 24న వేంపల్లెలో మెగా ఉచిత వైద్య శిబిరం

వేంపల్లె: మే 21 ప్రభాతవార్త
వేంపల్లెలోని గండి రోడ్డులో ఉన్న డాక్టర్ బాష ఆసుపత్రిలో ఈనెల 24వ తేది ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డాక్టర్ ఎస్ ఎఫ్ బాష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో వేంపల్లెలోని డాక్టర్ బాష హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 24 వ తేది ఉదయం 9 గంటల నుండి 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం ఉంటుందని చెప్పారు. కడప పట్టణానికి చెందిన క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ వంశీ విహారీ హాజరు అవు తున్నట్లు తెలిపారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు, షుగర్, బిపి, థైరాయిడ్, పక్షపా తం వ్యాధులకు సూచనలు కూడ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఉచిత వైద్య శిబిరం నందు బిపి, షుగర్ వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపా రు. ఈ అవకాశాన్ని వేంపల్లె పరిసర ప్రాంతాల్లో ఉన్న రోగులు అందరూ సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత వైద్య శిబిరంకు వచ్చే ప్రజలు ముం దుగా డాక్టర్ ఎస్ఎఫ్ బాష ఆసుపత్రిలో పేర్లును నమోదు చేసుకోవాలన్నారు.

## ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 2వ రోజు ధర్నా

ప్రొద్దుటూరు క్రైం, మే 21, ప్రభాతవార్త:
ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం 2వ రోజు డిపో నాయకులు టీఆర్‌జీ రెడ్డి ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు డిపో వద్ద గేట్ ధర్నా ను నిర్వహించడం జరిగింది. ప్రొద్దుటూరు డిపో నాయకులు ఎస్ఎస్ నారా యణ మాట్లాడుతూ ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం కొనుగోలు చేసి ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. స్త్రీ శక్తి బస్సులలో జీరో టికెట్ ఇచ్చే విధానాన్ని నిలుపుదల చేసి మిగతా టికెట్లు ఇచ్చి కండక్టర్లపై పనిభారం తగ్గించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు, అరియర్స్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఇవ్వాలని రిటైర్డ్ అయిన, చనిపోయిన సిబ్బం దికి వెంటనే సెటిల్‌మెంట్స్ చేయాలని, ఏపీ పీటీడీ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ నుంచి మినహాయించి గతంలో ఆర్టీసీలో ఉన్న వైద్య సదుపాయాలు అమలు చేయాలని కోరారు. జోనల్ నాయకులు రామకృష్ణ, రీజన్ నాయకుడు భా నుప్రసాద్, డిపో నాయకులు వైఆర్‌కే రెడ్డి, డిపో సెక్రటరీ గోపాల్, గ్యారేజీ సెక్రటరీ అశోక్, గ్యారేజీ నాయకులు అల్తాఫ్, నాయకులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో ఇద్దరు చైన్ స్నాచర్స్

సిద్ధవటం మే 21 ప్రభాతవార్త
మహిళల మెడలో నుంచి విలువైన బంగారు వస్తువులు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు తమిళ రాష్ట్రానికి చెందిన చైన్ స్నాచర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు వివరాల్లోకెళితే ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం గ్రామానికి చెందిన ఆలూరి సరోజ గురువారం సాయంత్రం లక్ష్మి హ్యాండ్లూమ్ వద్ద ఉన్న కిరాణా షాపు వద్ద కూల్ డ్రింక్ కొనుగోలు చేసి డబ్బులు చెల్లిస్తూ ఉండగా వాటర్ వాటర్ కావాలని ఒక వ్యక్తి లోపలికి వచ్చి వాటర్ బాటిల్ కొనుగోలు చేసి మరో వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఉండగా ఆలూరి సరోజ మెడలో ఉన్న 42 గ్రాముల తాళిబొట్టు సరుడు లాగుతుండగా సరోజ గమనించి అతని రెండు చేతులు పట్టుకోగా అతను ద్విచక్ర వాహనంపై పారిపోయాడు స్థానికులు వెంటనే హైవే పోలీసులకు సమాచారం ఇచ్చారు ద్వి చక్ర వాహనంలో అతివేగంగా పారిపోతూ బద్వేలు వైపు నుండి కడపకు వెళ్తున్న కారును సిద్ధవటం మండలం కమ్మ పాలెం క్రాస్ వద్ద ఢీకొట్టారు విష యం తెలుసుకున్న ఎస్ఐ హారిక తమ సిబ్బందితో వెళ్లి ఇరువురిని అదుపులోకి తీసుకొని జరిగిన ఘటనపై విచారిస్తున్నారు.

## వెంకటేష్ కుటుంబానికి అండగా వుంటా



నివాళులర్పిస్తున్న గువ్వల రమేష్‌రెడ్డి

చౌడేపల్లి, మే 11 ప్రభాతవార్త
గుండెపోటుతో మృతి చెందిన తేదేపా కార్యకర్త వెంకటేష్ కు టుంబానికి అండగా వుంటామని మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి (చిట్టి) అన్నా రు. సోమవారం మృతుడు వెం కటేష్ అంత్యక్రియల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా పూల మాలలేసి నివాళులర్పించారు. మట్టి ఖర్చులకు గాను మృతుడు భార్య సుమిత్రకు ఆర్థికసాయమందించారు. అదే విధంగా వెంకటేష్ స్నేహితుడు మంజునాథ్ అతని మిత్ర బృందం ఆర్థిక సాయం చేసారు. ఈ కార్యక్రమంలో తేదేపా నాయకుడు శ్రీధర్‌రాజు(గిరి), తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నతాధికారులు ఆదేశాలు తప్పక పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసిల్దార్ శివకుమార్

పీలేరు మే 11 ప్రభాతవార్త:
రాష్ట్ర పరిధిలో ప్రభుత్వం ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించాలని ఆదేశాలు ఉండటంతో రాష్ట్రంలో జిల్లా పరిధిలో డివిజన్ పరిధిలో ఉన్నతాధికారులకు స్థానిక ప్రజలు సమస్యలపై అర్జీలు సమర్పించిన వాటిపై తక్షణము స్పందించకుంటే సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారి ఆదేశాలు తప్పక పాటించాలని సూచించారు. అలా పాటించిన వారిపై క్రమశిక్షణ కింద చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో అందజేసేందుకు కూడా సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసిల్దార్ ప్రసాద్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మురుగయ్య విలేజ్ రెవెన్యూ అధికారులు హేమంత్ నాయక్ ,వెంకటేష్, రెడ్డి శేఖర్, సుధాకర్ సుధాకర్ బాబు, ప్రసాద్ బాబు, ఎల్లప్ప అజయ్ కుమార్,ఏ ఎస్ ఓ రెడ్డప్ప నాయుడు ,మండల సర్వే రెడ్డి శేఖర్ సిబ్బంది శిరీష, బావాజీ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ బలోపేతంపై కీలక చర్చలు

పులివెందుల, మే 21 , ప్రభాతవార్త :
పులివెందుల టీడీపీ కార్యాలయంలో పులివెందుల టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డిను జోన్5 (కడప, కర్నూలు, నంద్యాల) కోఆర్డినేటర్, ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర కనీస వేతన సలహా బోర్డు చైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి మ ర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లే అంశంపై ఇద్దరు నేతలు విస్తృతంగా చర్చించారు. అలాగే పులివెందుల నియోజకవర్గంలో పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బ లోపేతం చేయడం, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, రానున్న రోజుల్లో పార్టీ కార్యాచరణను సమర్థవంతంగా నిర్వహించడం వంటి అంశాలపై సమావేశంలో చర్చ జరిగినట్లు నాయకులు తెలిపారు. ఈ సమా వేశంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల ఇంచార్జ్‌లు, సీనియర్ నాయ కులు, పార్టీ ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని, కూటమి ప్రభుత్వం చేపడుతు న్న అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని నాయకులు పిలుపు నిచ్చారు.



మాట్లాడుతున్న బీటెక్ రవి మరియు జోన్ 5 కోఆర్డినేటర్ శ్రీనివాసులు

# రాజీవ్ గాంధీ గొప్ప దార్శనికుడు, రాజనీతిజ్ఞుడు

వేంపల్లె మే 21 ప్రభాతవార్త
భారత మాజీ ప్రధాని,కాంగ్రెస్ పార్టీ మాజీ జాతీయ అధ్యక్షులు, భారతర త్న స్వర్గీయ రాజీవ్ గాంధీ గొప్ప దార్శనికుడు, రాజనీతిజ్ఞుడని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి కీర్తించారు. గురువారం వేంపల్లి లో కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ 35వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మా ట్లాడుతూ 1985 నుంచి 1991 వరకు ఆరు సంవత్సరాల పాటు ఏఐసిసి అ ధ్యక్షులుగా రాజీవ్ గాంధీ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. 1984 నుంచి 1989 వరకు ఐదు సంవత్సరాల పాటు భారత ప్రధానిగా దేశానికి ఎనలేని సేవ చేశారు. జాతి నిర్మాణంలో యువతకు ఎక్కువ ప్రాధా న్యత కల్పించాలన్న ఉద్దేశంతో ఓటు కనిష్ట వయోపరిమితిని 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించిన యువత పక్షపాతి రాజీవ్ అన్నారు. స్థాని క ప్రభుత్వాలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి మహిళా సాధి కారతకు కృషి చేసిన మహిళా పక్షపాతి.. 73, 74 రాజ్యాంగ సవరణ చట్టాల ద్వారా స్థానిక సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించి బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి బాట వేసిన దార్శనికుడు. దేశంలో ఎలక్ట్రానిక్, సమాచార విప్లవానికి ఆద్యుడు. ఈనాడు ప్రతి ఒక్కరి చేతిలో టెలిఫోన్ ఉంది అంటే దా నికి కారకుడు రాజీవ్. ఈనాడు ప్రతి ఒక్కరి ఇంట్లో టీవీ ఉంది అంటే దానికి కారకుడు రాజీవ్. 1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరంబదూరు వద్ద ఎల్‌టిటిఇ ఈ ఉగ్రవాదుల దురాగతానికి రాజీవ్ గాంధీ బలైపోయారు. అందుకే మే 21ని ఉగ్రవాద వ్యతిరేక దినంగా జరుపుకుంటున్నామని తులసి రెడ్డి అన్నా రు. రాజీవ్ జీవించింది కేవలం 47 సంవత్సరాలు మాత్రమే. ఎన్నాళ్లు జీవిం చామన్నది కాదు. జీవించిన కాలములో ఏమి చేసాము అన్నది ముఖ్యం. రా జీవ్ గాంధీ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం, అనుసరణీయం,మార్గదర్శకం, స్ఫూర్తిదాయకం అని తులసి రెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధ్రువ కుమార్ రెడ్డి, బీగాల రామకృష్ణ,సీనియర్ కాంగ్రెస్ నాయ కులు నర్రెడ్డి అలివేలమ్మ, ఉత్తన్న,బద్రీనాథ్,రాఘవయ్య, శేఖర్, శివ నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు.



# దేశవ్యాప్తంగా ఓబీసీ కులగణన చేపట్టాలి: బీసీ రమణ

బద్వేలు, మే 21, ప్రభాతవార్త
బీసీల సమగ్రాభివృద్ధి కోసం దేశవ్యాప్తంగా ఓబీసీ కులగణనను కేంద్ర ప్రభు త్వం చేపట్టాలని జాతీయ బీసీ చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బీసీ రమణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన వి లేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, దేశంలో ఓబీసీ కులగణన నిర్వహించకూడదంటూ సుప్రీంకోర్టులో దా ఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని (పిల్) కోర్టు కొట్టివేసిందని తెలిపారు. అదే సమ యంలో కేంద్ర ప్రభుత్వానికి ఓబీసీ కులగణనను వెంటనే చేపట్టాలని సూచిం చిందన్నారు. దేశవ్యాప్తంగా ఓబీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సా మాజిక రంగాల్లో జనాభా ప్రాతిపదికన తగిన వాటా దక్కేందుకు కులగణన ఎంతో అవసరమన్నారు. దేశ జనాభాలో 54 శాతానికి పైగా ఉన్న ఓబీసీలు దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని, కులగణన ద్వారా వారి వాస్తవ పరి స్థితులు వెలుగులోకి వస్తాయని అన్నారు. కులగణన చేపట్టకపోతే దేశ సంపద కొద్దిమంది వర్గాలకే పరిమితమై, పేద-ధనిక మధ్య అంతరం మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహ సిల్దారు కత్తి బ్రహ్మయ్య, రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎం. శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రమణయ్య, రిటైర్డ్ బీసీ ఉద్యోగి ఎస్.ఎన్. సుబ్బరాయుడు, బద్వేల్ పట్టణ చేతివృత్తిదారుల సంఘ కార్యదర్శి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.




# గ్రోసు గోల్డ్ మెడల్ విజేతలు వీరే

మదనపల్లి మే 11 ప్రభాతవార్త:
అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గ్రోసు గోపాలయ్య మెమోరియల్ గోల్డ్ మెడల్‌కు ఎంపికైన ఇంటర్మీడియట్, పదవ తరగతి విద్యార్థుల జాబితాను ఆ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బండపల్లి వెంకటరమణ, ఎమ్. వెంకటరమణలు సోమవారం ప్రకటించారు. మే 24వ తేదీ నెల్లూరులోజరిగే కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గ్రోసు సుబ్బారావు చేతులమీదుగా గోల్డ్ మెడలను అందించనున్నట్లు వారు తెలిపారు. పదవతరగతి లో సి చరిత గోల్డ్ మెడల్‌కు ఎంపిక కాగా జి.కీర్తిశ్రీ, పి.పర్ణిక, జి.అభిషేక్‌లు ప్రోత్సాహక బహుమతులకు ఎంపికయినట్లు తెలిపారు. ఇంటర్మీడియట్లో కే మోక్షిత గోల్డ్ మెడల్‌కు ఎంపిక కాగా, ఎన్.రెడ్డి పర్ణిక, వి.అశ్వినిలు ప్రోత్సాహ కబహుమతులకు ఎంపికైనట్లు వారు తెలిపారు. గాండ్ల కుల సంక్షేమంలో భా గంగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు తమ కులస్తులలో ఎక్కువ మార్కులు సాధించిన వారికి ఈ బహుమతులు ప్రతి ఏటా ఇస్తున్నట్లు వారు తెలిపారు.

## పక్క రాష్ట్రాల నుండే కాదు, పక్క జిల్లాల నుండీ పీలేరుకు మద్యం తరలింపు!

## బెల్ట్ షాపుల మాఫియాపై ఉక్కుపాదం మోపాలి : సిపిఐ

మదనపల్లి మే 11 ప్రభాతవార్త :
పీలేరు నియోజకవర్గంలో విచ్చలవిడిగా నడుస్తున్న అక్రమ బెల్ట్ షాపులపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత కమ్యూనిస్ట్ పార్టీ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ ఈరోజు అన్నమయ్య జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా టి.ఎల్. వెంకటేష్ మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గం ఇప్పుడు బెల్ట్ షాపులకు అడ్డాగా మారింది. ఇక్కడ జరుగుతున్న అతిపెద్ద దోపిడీ ఏంటంటే, ..పక్క ప్రాంతాలైన తిరుపతి, చిత్తూరు, మదనపల్లె, బంగారుపాళ్యం నుండే కాకుండా కర్ణాటక సరిహద్దుల నుండి కూడా అక్రమంగా మద్యాన్ని పీలేరుకు తరలించి.. గల్లీగల్లీలో బెల్ట్ షాపులు పెట్టి అమ్ముతున్నారు. లైసెన్స్ ఉన్న షాపుల్లో ఎమ్మార్పీ కన్నా 50 ఎక్కువకు అమ్మితే, ఈ బెల్ట్ షాపుల్లో అయితే దోపిడీకి అడ్డే లేదు. రాత్రి 10 దాటినా, తెల్లవారుజామున 4కి కూడా మద్యం దొరుకుతోంది. ఇదంతా ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారులకు తెలిసే జరుగుతోంది. నెలమా మూలు అందితే చాలు, ఎన్ని బెల్ట్ షాపులైనా నడిపించుకునే దుస్థితి.. నెల కొంది. ప్రభుత్వం టెండర్ల రేట్లు విపరీతంగా పెంచడం వలన వ్యాపారులు ఆ భారాన్ని పేద ప్రజలపై వేస్తున్నారు. రోజుకు 500 సంపాదించే కూలీ, ఆ డబ్బంతా బెల్ట్ షాపులోనే తగలేస్తున్నాడు. దీనివలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. పిల్లల చదువులు, ఇంట్లో పూట గడవడం కష్టంగా మారింది. పక్క జిల్లాల నుండి పీలేరుకు జరుగుతున్న మద్యం అక్రమ రవాణాను వెంటనే అరికట్టాలి. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మ రం చేయాలి. . క్షేత్రస్థాయిలో తక్షణ దాడులు చేసి బెల్ట్ షాపులను సీజ్ చేయాలి. ఒక ప్రాంతంలో బెల్ట్ షాప్ నడుస్తుంటే ఆ ప్రాంత ఎక్సైజ్, పోలీస్ అధికారులను బాధ్యులను చేసి చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ మద్యం విధానాన్ని పునఃసమీక్షించి పేదవాడిపై భారం పడకుండా చూడాలి. జిల్లా కలెక్టర్ గారు వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే, ప్రజలను సమీకరిం చి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతాం. పేదల సంసారాలతో చెలగాటమాడితే సహించేది లేదు అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పెద్దిరెడ్డి కవితా రెడ్డి, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.



# సమస్యలు పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవు

## ప్రజాదర్బార్ పాల్గొన్న ఎమ్మెల్యే షాజాహాన్ బాషా

రామసముద్రం మే 11 ప్రభాతవార్త :
ప్రజాసమస్యలు పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహి స్తున్నట్లు ఎమ్మెల్యే షాజాహాన్ బాషా అన్నారు, సోమవారం మండల కేం ద్రంలోని ఎంపిడివో కార్యాలయ ఆవరణలో ఎంపిడిఓ లతీఫ్ ఖాన్ ఆధ్వ ర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలం లోని వివిధ గ్రామాల వచ్చిన ప్రజలతో వినతులను స్వీకరించారు, ప్రజలు నిర్భయంగా తమ సమస్యలను తెలపాలని కోరారు, అప్పుడే సమస్యలు పరి ష్కారం అవుతాయన్నారు, స్వీకరించిన వినతులను వెంటనే పరిష్కరించా లని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడు తూ ప్రజలకు మేలు చేయాడమే మన ప్రభుత్వ లక్ష్యం అని, గ్రామాల్లో పారిశుద్యం పనులు చేపట్టాలని, గ్రామాల్లో నీటి సమస్యలు ఉండరాదని, డ్రైనేజి పనులు చేపట్టాలని, విద్యుత్ సమస్యలు ఉండరాదని, ముఖ్యం గా రెవిన్యూ సమస్యలపై ఎక్కువ దృష్టి పెట్టాలని, పేద ప్రజలకోసం ప్రభుత్వ ఆసుపత్రిలో సకాలంలో వైద్యం అందించాలని, గ్రామాలు అభివృద్ధి చెందా లంటే పంచాయతీ కార్యదర్శులు ముందుండాలని ప్రతి రోజు రెండు గ్రామా ల్లో పర్యటన చేసి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు, ఉపాధి హామీ ఏపిఓ మాధవిని ఉపాధి హామీ గురించి విషయాలు అడిగి తెలుసుకున్నారు, మండలంలో రైతులకు 1200 జాబ్ కార్డులు మంజూరు చేసామన్నారు, జిల్లా లోనే మొదటి స్థానంలో మండలం ఉన్నదని ఆమెకు ఎమ్మెల్యే శాలువ కప్పి అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి సీనియర్ నాయ కులు తిప్పన్న, మాజీ జడ్పీటీసీ మునివెంకటస్వామి, సీతారామస్వామి, పెద్దిరెడ్డి, కృష్ణం రాజు,చిన్ను స్వామి,గబ్బురి బదిరీ నాథ్,రూపేష్ రెడ్డి,రాజేష్ స్వామి,నడింపల్లె రమేష్,బోయవీధి రమణ,మహేష్ రెడ్డి, జావెద్, మోడల్ స్కూల్ చైర్మన్ బాలాజీ, టిడిపి మహిళా అధ్యక్షురాలు భూలక్ష్మి, వాహీద్ వేణుగోపాల్, బిసి నాయకులు రెడ్డెప్ప, పూజారి గంగప్ప,ఊలపాడు శ్రీనివాసులు,చాంద్ బాషా,చమ్ములు,అధికారులు తాహిసీల్దార్ మహ్మద్ అజారుద్దీన్,ఎస్సై హృషికేశవ రెడ్డి,ఏ ఈ మస్తాన్ వల్లి, ఆర్ ఐ వసీమ్,డాక్టర్ లు జాహ్నవి ఉషా,ఎంపిడిఓ 2 కృష్ణవేణి,ఏ పి ఎం సాంబశివ,ఏపీఓ మాధవి, వ్యవసాయ అధికారి జాఫర్,రెవిన్యూ అధికారులు,పంచాయతీ సెక్రటరీలు ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.



## వైఎస్సార్‌సీపీ నేత సుందర రామిరెడ్డిని పరామర్శించిన నల్లేరు విశ్వనాథ రెడ్డి



బద్వేల్ అర్బన్, మే 21 (ప్రభాతవార్త):
బద్వేల్ మున్సిపాలిటీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుర్రంపాటి సుందర రామిరెడ్డిని బద్వేల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అదనపు సమన్వ యకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి గురువారం పరామర్శించారు. ఇటీవల అస్వ స్థతకు గురైన సుందర రామిరెడ్డి కడపలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది, ప్రస్తుతం బద్వేల్‌లోని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న విశ్వనాథ రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నల్లేరు విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ గుర్రంపాటి సుందర రామిరెడ్డి గారు త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన మళ్లీ యధావిధిగా ప్రజాసేవా కార్యక్ర మాల్లో చురుకుగా పాల్గొనాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయ కులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పీహెచ్సీని,సిహెచ్సిగా చేయాలి

బ్రహ్మంగారిమఠం మే 21 ప్రభాతవార్త



ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారి మఠా న్ని దృష్టిలో పెట్టుకొని మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని,కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్చాలని మండల తెలుగుదేశం పా ర్టీ సీనియర్ నాయకుడు ఎస్సార్ శ్రీనివాసు లురెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం బ్రహ్మంగారిమ ఠంలో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ఉందని, ఈ ఆరోగ్య కేంద్రంలో ప్రస్తుతం పేషంట్లకు సరి పడ వసతులు లేవన్నారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారిని దర్శించేందుకై ఇతర రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి కూడా భక్తులు రావడం జరుగుతుందని. దీన్ని దృష్టిలో పెట్టుకొని స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూ నిటీ హెల్త్ సెంటర్ గా మార్చినట్లయితే రోగులకు మరింత సులభతరంగా వై ద్య సేవలు అందుతాయన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి ఇక్కడ సిహెచ్సి సెంటర్ ఎందుకు పెట్టాలనో, దాని ప్రాముఖ్యత గురించి ఎ మ్మెల్యేకు వివరించి,ఎమ్మెల్యే ద్వారా ఈ ప్రయత్నం చేస్తానని శ్రీనివాసులరెడ్డి తెలియజేశారు.

## ప్రజల మధ్యే ఉంటూ సేవ చేస్తున్న

# మధుపై విమర్శలు తగవు




పులివెందుల, మే 21 ,ప్రభాత వార్త :
పులివెందుల పట్టణంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పులివెందుల పట్టణ టీడీపీ నాయకులు ఆకుల ప్రసాద్, పెంచలయ్య, నామ ప్రతాప్, భాస్కర్, నారాయణరెడ్డి, శ్రీను లు వైసీపీ నాయకులపై తీవ్ర స్థాయి లో విమర్శలు గుప్పించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూదన్ రెడ్డిని విమర్శించే అర్హత వైసీపీ నాయకులకు లేదని స్పష్టం చేశారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీ, భాస్కర్, నా రాయణరెడ్డి తదితర వైసీపీ నాయకులంతా కలిసి మధుసూదన్ రెడ్డిపై విమ ర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సంబంధించిన వివాదంపై తమ పార్టీ ఇప్పటికే వివరణ ఇచ్చిం దని తెలిపారు. తూగుట్ల మధుసూదన్ రెడ్డి మున్సిపల్ పరిధిలో ప్రజా సమ స్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల మధ్య తిరుగుతున్న నాయకుడని పేర్కొన్నారు. మురుగునీటి కాలువలు, రోడ్లు, పారిశుధ్యం వంటి సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజల పక్షాన పోరాడుతున్నారని తెలిపారు. వైసీపీ పాలనలో పులివెందుల అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని ఆరోపించిన టీడీ పీ నాయకులు, చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం తిరిగి అభివృద్ధి దిశగా ప యనిస్తోందన్నారు. గతంలో పరిశ్రమలు, ఉద్యోగ అవకాశాలు తగ్గిపోయా యని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాటి పునరుద్ధరణకు చర్యలు తీసుకుం టోందన్నారు. ప్రజలకు సేవ చేసే నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని వైసీపీ నాయకులకు సూచించా రు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాద స్థలంలో మృతి చెందిన చంద్రశేఖర్ రెడ్డి

పీలేరు, మే 11, ప్రభాతవార్త:
నియోజకవర్గంలోని కలకడ మండలంలో సోమవారం విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మండలంలోని మల్లవరం వాండ్ల పల్లికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం స్థాని కంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది. చంద్రశేఖర్ రెడ్డి తన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై కదిరాయ చెరువు నుంచి బంతలవారిపల్లి వైపు వెళుతు ప్రమాదానికి గురయ్యాడు. ప్రయాణిస్తున్న సమయంలో బైక్ అకస్మాత్తుగా అదుపుతప్పి రోడ్డు పక్కనున్న సూచికరాయిని బలంగా ఢీకొట్టింది. ఆయనకు తీవ్ర గాయాలు అ య్యాయి. స్థానికులు గమనించి సహాయం చేయడానికి చేరుకునేలోపే చంద్రశేఖర్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. ఘటన సమాచారం అందుకున్న వెంటనే కలకడ ఎస్సై రామాంజులు సిబ్బందితో కలిసి ప్రమాద స్థలానికి చేరు కుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలే రు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యువకుడు ఆకస్మికంగా మృతి చెందడం తో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగి పో యారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికులు రోడ్డు ప్రమా దాల నివారణకు వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని సూచిస్తున్నారు.

## గాయపడ్డ నిరంజన్‌రెడ్డిని పరామర్శించిన హరిబాబు



చౌడేపల్లి, మే 11 ప్రభాతవార్త
విద్యుత్‌షాక్‌కు గురై గాయ పడ్డ నిరంజన్‌రెడ్డిని పుంగనూరు నియోజకర్గ బిసివై పార్టీ కన్వీనర్ హరిబాబు యాదవ్ పరామ ర్శించారు. మండలంలోని పరికి దొన పంచాయతీ కంపల్లికి చెం దిన నిరంజన్‌రెడ్డి లద్దిగం విద్యు త్ సబ్‌స్టేషన్ పరిధిలో ప్రమా దవశాత్తు షాక్‌కు గురై బెంగళూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నాడు. ఈక్రమంలో హరిబాబు యాదవ్ పరామర్శించి, మెరుగైన వైద్యమందిం చాలని వైద్యులకు సూచించారు. నిరంజన్‌రెడ్డి కుటుంబానికి అండగా వుంటామని భరోసా ఇచారు. బిసివై పార్టీ నాయకులు పరామర్శించిన వారిలో వున్నారు.

# తనలా ఉన్నవారికి ఉపాధి ఇస్తూ..

**ఒక్క అవకాశమివ్వండి. నా శరీరానికే సమస్య. నా మెదడుకు కాదు.. ఇంటర్వ్యూకు వెళ్లిన ప్రతిసారి అక్కడివారికి దిశా పాండ్యా చెప్పే మాటే ఇది! అయినా 17 తిరస్కరణలు తప్పలేదు. అలాంటి తను ప్రముఖ సంస్థల్లో పనిచేసింది. అథ్లెట్‌గా గుర్తింపు తెచ్చుకుంది. తనలా సమస్య ఉన్నవారికి ఉపాధి అవకాశాలూ చూపిస్తోంది. ఇంతకీ ఎవరీమె? ఏమిటామె సమస్య !**



నాన్న సలహా మేరకు డిజెబిలిటీ సర్టిఫికెట్ తెచ్చుకుందామని గవర్నమెంట్ ఆఫీసుకి వెళ్లింది దిశ. ఒక కళ్లు లేని అమాయిని సాయమడిగితే తన దఖాస్తునీ పూర్తిచేసింది. అప్పుడా అమ్మాయి 'మీ సమస్యేంటి' అనడిగితే నేను 'మరుగుజ్జు' అని సమాధాన మిచ్చింది దిశ. అర్థం కాలేదా అమ్మాయి దీంతో 'నా కాళ్లూ చేతులూ మిగతావారి కంటే చిన్నగా ఉంటాయని చెప్పింది దిశ. దానికామె అవయవాలన్నీ బాగానే పనిచేస్తున్నాయి కదా! అలాంటప్పుడు నీకు నువ్వు లోపమున్న వ్యక్తిగా ఎందుకు చెప్పుకొంటున్నావ్ అనడిగిందట. ఆలోచనలో పడిన దిశ సర్టిఫికెట్ తీసుకోకుండానే వెనుదిరిగింది. దిశ ఎత్తు 4.2అడుగులే. ఈమెది ముంబయి. జన్యులోపం కారణంగా అలా పుట్టింది. ఆటలన్నా, డాన్స్ అన్నా ప్రాణం. కానీ స్కూల్లో తోటివిద్యార్థులు చేర్చుకునేవారు కాదు. పెద్దయ్యేకొద్దీ పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఏం చేసినా ఏడిపించేవారు. బయటికి వెళ్లాలంటేనే భయపడేది.

ఈ క్రమంలో కాలేజీలో ఫెయిల్ అయ్యింది.

**ఆటల్లోనూ అడుగుపెట్టి ....** ఆమె అమ్మానాన్నలదీ ఇదే సమస్య. అయినా కూతురిని అన్నింటా ప్రోత్సహించే వారు. అలాంటిది ఆమె ఫెయిల్ అయ్యేసరికి తండ్రి దిగులుపడ్డాడు. ఆయన్నలా చూడలేకపోయింది దిశ. అందుకే ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రాఫిక్ డిజైనింగ్ చేసింది. ఆపై డిగ్రీ పూర్తయ్యింది. రెండు డిగ్రీలతో మంచి ఉద్యోగం ఖాయం. నాన్న ముందు గర్వంగా నిలబడొచ్చు అనుకుంటే.. అర్హతలన్నీ సరే కానీ.. మీరు ఉంటే ఇతరులు ఇబ్బందిగా ఫీలవుతారు అని తిరస్కరించేవారు. అర్హత ఉన్నా రూపం కారణంగా తిరస్కరించడంతో కుంగిపోయింది. దీంతో ఆమె తండ్రి మనకీ డిజెబిలిటీ సర్టిఫికెట్ ఇస్తారు. దాంతో అయినా ప్రభుత్వోద్యోగం పొందొచ్చు. ప్రయత్నించు అన్నారట. కానీ ఆ కళ్లు లేని అమ్మాయి మాటతో దాన్ని వదిలి సొంతంగా ఉద్యోగం ప్రయత్నించింది దిశ. హెచ్‌డిఎఫ్‌సీ, బిస్లరీ వంటి ఎన్నో సంస్థల్లో గ్రాఫిక్ డిజైనర్‌గా పనిచేసింది. ప్రస్తుతం రిచ్స్ ఇండియా క్రియేటివ్ హెడ్. అనుకోకుండా రైల్లో పరిచయమైన మరో వ్యక్తి స్ఫూర్తితో త్రో బాల్‌లో రాణించింది. నేషనల్ పారా బ్యాడ్మింటన్ ప్లేయర్, మారథాన్లలోనూ పాల్గొంటోంది.

**వారికి సాయపడాలనే...** తనలా ఎంతోమంది ఇబ్బంది పడటం గమనించంది దిశ. వాళ్లకి సాయపడాలని 2018లో లిటిల్ పీపుల్ ఇండియా (ఎల్‌పిఐ) ప్రారంభించింది. దీనిద్వారా మరుగుజ్జులకు ఉద్యోగాలు, క్రీడల్లో అవకాశాలను చూపిస్తోంది. దీనికోసం కార్పొరేట్ సంస్థలతో ఒప్పందాలనూ చేసుకుంది. సినిమాలు, సర్కస్‌లు.. కారణమేదైతేనేం పొట్టిగా కనిపిస్తే నవ్వేవారే ఎక్కువ. కానీ ఆ ప్రభావం వారిపై చాలా ఉంటుం దన్నది మర్చిపోతున్నారు. కాబట్టే, చాలా మంది తమ రూపాన్ని చూసుకుని బాధనపడు తుంటారు. వాళ్లలో ఆత్మవిశ్వాసం నింపాలని ఎల్‌పిఐ ప్రారంభించా. ఏడుగురితో మొదలైన సంస్థలో ప్రస్తుతం 650 మంది సభ్యులున్నారు. ఉపాధి, క్రీడలు..నచ్చిన అంశాల్లో దేశవ్యాప్తంగా ఉన్న నాలాంటివారికి సాయమందిస్తున్నా. దీనికోసం ఎన్‌జిఓలతోనూ కలిసి పనిచేస్తున్నా. పొట్టి అనేకాదు, ఇంకా ఎన్నో రకాలుగా ఏడిపించడం సహజమే దాన్ని మనం పట్టించు కున్నప్పుడే ఓడిపోతాం. అలాకాకుండా వాట న్నింటినీ పక్కకునెట్టి, చుట్టూ ఉన్న అవకాశా లను అందుకుంటూ ముందుకు సాగండి. విజేతలుగా నిలుస్తా' అంటోన్న 39 ఏళ్ల దిశ టెడెక్స్ స్పీకర్ కూడా.



ఈ విశ్వానికి ఆద్యుడు శ్రీకృష్ణుడు సర్వం తెలిసిన వ్యక్తి. తాత్విక వేత్త ఎప్పుడు ఎలా మసలుకోవాలో, ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో బాగా తెలిసిన నేర్పరి మంచి రాజనీతివేత్త కురు, పాండవుల మధ్య సమరం జరుగరాదని, జరిగితే వచ్చే నష్టాన్ని కళ్ళకు కట్టనట్లుగా సయోధనునికి తెలిపిన జ్ఞాని. పాండవులకు ముఖ్య సలహాదారుడిగా అన్నిటా తానై ఉండి సంరక్షించిన మహా మనిషి. ద్రౌపది వస్త్రపహరణం జరిగిన వేళ చీరెలు ఇచ్చి చెల్లెలికి రక్షణగా నిలబడిన వ్యక్తి. మాయ జూదంలో పాండవులు ఓడి పోతారని, అది వారికే లాభా దాయకమని ముందే పసిగట్టిన భవిష్యత్ విధాత శ్రీకృష్ణుడు. అర్జుననికి రథ సారధిగా ఉండి యుద్ధ మెలకువలు తెలిసిన వ్యక్తి. సూర్యాస్తమయంలోగా సైందవుడిని సంహారిస్తానని చెప్పినప్పుడు, కాలాన్ని మార్చి వేసిన లోక దారి. అర్జునుని ప్రతిజ్ఞ సఫలం కావడానికి శ్రీకృష్ణుని లీలనే ప్రధానం అలానే శిశు పాలుని నూరు తప్పులు క్షమిస్తానని అత్తకు మాట ఇచ్చి నూటొక్క తప్పులు చేయబోతున్నప్పుడు మాట ప్రకారం సుదర్శన చక్రంతో శిశుపాలుని శిరము ఖండించి వేసే మాట జవదాటని వీరుడు. వాస్తవాలు గమనించి పాండవుల పక్షాన చేరమని జన్మ రహస్య కర్ణుడికి చెప్పిన తత్వవేత్త. శకుని మాయో పాయములు తెలిసిన సూత్రదారి. కౌరవుల పంచనే ఉండి,



# మహా దౌత్యవేత్త శ్రీకృష్ణుడు

వారిని పాండవుల పైకి రెచ్చగొట్టి, సుయోధనుని పతనం, శకుని కుయుక్తులు తెలిసిన సర్వగ్నుడు కృష్ణుడు. అష్ట మహిషలను ఒకటిగా చూసిన రసగ్నుడు. సత్యభామ కోపాన్ని శాంతింప జేసిన శాంతిదాత. రుక్మిణిని ఆసాంతం తన హృదయంలో నిలుపుకున్న హృదయాలోలుడు. గోపికలచే నృత్యాలు చేస్తు ఆడుతూ, పాడుతూ వారి మనసును గెలిచిన ప్రేమ మూర్తి చిన్న తనంలోను, పెద్ద తనంలోను వెన్న అంటే మహాఇష్టముగా జుర్రుకున్న వెన్న దొంగ విధురుని భక్తిని స్వయంగా చూసిన భక్తి పరుడు. విశ్వరూపాన్ని చూపి తన ధర్మాన్ని నిర్వర్తించమని పార్థునికి భగవద్గిత బోధించిన శ్రీకృష్ణుడు నాటికీ, నేటికీ మనకు ఆద్యుడు పూజ్యుడు మహా పురుషుడు. నన్నే పూజిస్తూ నాకు తృణమో, ప్రణమో అర్పించిన వారిని నేను ఈతి బాధల నుండి తీరం చేరుస్తానని సత్యం చెప్పిన సర్వగ్నుడు మన శ్రీకృష్ణుడు. ఇన్ని మంచి కార్యములు చేసిన కపట నాటక సూత్రధారి అని పేరు పడినా, మంచి చేయి వారికి సహాయంగాను, చెడు చేసిన వారిని శిక్షించిన వ్యక్తిగా లోక ప్రసిద్ధుడుగా, కోరిన వారికి వరాలు నొసంగే. దయమూర్తి శ్రీకృష్ణుడు బలరామునికి చేదోడుగా ఉండి ఆదర్శ సోదరునిగా మెలగిన శ్రీకృష్ణుడు సర్వదా మనకు ఆరాధనీయుడు.

**- కనుమ ఎల్లారెడ్డి**

# పాలకూరతో మేలు

ఇది రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. చూపును మెరుగుపరుస్తుంది. ఎముకలు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. ఊబకాయం రాదు. గుండెజబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుంది. పాలకూర తరచూ తినేవారిలో మెదడు పనితీరు మెరుగ్గా ఉంటుంది. శరీరం ప్రశాంతంగా ఉంటుంది. ఒత్తిడి, ఆందోళనల నుంచి ఉపశమనం కలుగుతుంది. పాలకూరలో యాంటీ ఏజింగ్ గుణాలు ఉన్నందున చర్మం కాంతిమంతంగా ఉంటుంది. ఇది క్యాన్సర్లను సైతం నిరోధిస్తుంది. పాలకూరతో ఇన్ని లాభాలున్న మాట నిజమే కానీ మూత్రపిండాల్లో రాళ్లు, బ్లడ్ క్లాట్స్ లాంటి సమస్యలు ఉన్నవారికి మాత్రం ఇది మేలు కంటే కీడేచేస్తుంది. వాళ్లు దీన్ని వీలైనంత తక్కువ తినడమే మంచిది.

# నల్లనయ్యకు నైవేద్యం



## తియ్యటి అటుకులు



**కావలిసినవి :** అటుకులు– రెండు కప్పులు, కొబ్బరిపాలు– రెండు కప్పులు, పంచదార– కప్పు, ఆకుపచ్చ ఫుడ్ కలర్–కొద్దిగా.

**తయారీ :** ముందుగా కొబ్బరిని గ్రైండ్ చేసి, అందులోంచి కొబ్బరి పాలు తీయాలి. సన్న సెగ మీద ఈ పాలు మరిగిస్తూ అందులో పంచదార వేయాలి. అది కరిగాక అటుకులు, ఫుడ్ కలర్ వేసి కలియతిప్పి కొద్దిగా ఉడికించి దించేయాలి. ఈ తియ్యటి అటుకుల పైన కాస్త కొబ్బరి కోరుచల్లితే.. రుచి పెరగడమే కాకుండా, మరింత ఆకర్షణీయంగా ఉంటుంది.

## కేసరి..

**కావలసినవి :** అటుకులు, చక్కెర–కప్పు చొప్పున, నెయ్యి–అర కప్పు, యాలకుల పొడి–అర చెంచా, జీడిపప్పు, కిస్మస్–అర కప్పు, కుంకుమ పువ్వు.

**తయారీ :** ముందుగా కడాయిలో నెయ్యి వేసి అటుకులు వేయించాలి. వేడి తగ్గాక కొంచెం బరకగా పొడి చేసుకోవాలి. ఇందులో నెయ్యి, కొద్దిగా నీళ్లు పోసి ఉండలు రాకుండా ఉడికించాలి. పంచదార వేస్తూ కలియ బెట్టాలి. దగ్గరగా అయ్యాక.. నేతిలో వేయించిన జీడిపప్పు, కిస్మిస్, కుంకుమ పువ్వు వేసి కలపాలి. అంతే.. కేసరి సిద్ధం.

## మోదకం



**కావలసినవి :** అటుకులు– రెండు కప్పులు, నెయ్యి– కప్పు, బెల్లం– పావు, యాలకుల పొడి–అర చెంచా, జీడిపప్పు, కిస్మన్–అర కప్పు, నచ్చిన ఫుడ్ కలర్ –కొద్దిగా

**తయారీ :** కడాయిలో కొద్దిగా నెయ్యి వేసి అటుకులు వేయించుకోవాలి. చల్లారాక మెత్తగా గ్రైండ్ చేయాలి. జీడిపప్పు, కిస్మిలో నేతిలో వేయించాలి. బెల్లం పాకం పట్టి–అందులో అటుకులు పొడి, యాలకుల పొడి, జీడిపప్పు, కిస్మిస్, ఫుడ్ కలర్ వేసికలపాలి. ఆ మిశ్రమంతో మోదకాలు చుట్టుకోవాలి. ఇవి రుచీ, ఆరోగ్యం కూడా.





వేడి పాత్రలను దించేందుకు పట్‌కార్ ఉపయోగించడం మనకేం కొత్త కాదు. అయితే వాటిని ఎప్పటికప్పుడు అవసరానికి తగ్గట్టు అధునాతనంగా రూపొందిస్తున్నారు. మారిన కాలానికి అనుగుణంగా అంచు లేని స్టీల్ పాత్రలు, అవెన్‌లో వేడి చేసేందుకు పింగాణీ పాత్రలు వాడుతున్నాం. పాత రకం పట్‌కార్ వీటికి అనుకూలం కాదు. ఎలాంటి పాత్రలనైనా

# చేతులు కాలవు, పాత్రలు బెసకవు !

బెసికిపోకుండా, గట్టిగా పట్టుకునేలా డిష్ గ్రిప్పర్లు, పాట్ హోల్డర్లు వచ్చాయి. వీటితో పాత్రలే కాదు, పింగాణీ ప్లేట్లు కూడా అటూ ఇటూ మార్చడం సులువుగా ఉంటుంది. రెండున్నర కిలోల బరువు వరకూ ఒక చేత్తో పట్టుకునే బౌల్ పికర్, డిష్ హోల్డర్, అంతకంటే బరువుంటే చిన్న క్లిప్పులాగ ఉండే రెండు గ్రిప్పర్లు: అవెన్ లేదా ఎలక్ట్రిక్ కుక్కర్ లోంచి తీయడానికి వేడి తట్టుకునే గ్లోవ్స్: ప్లేట్లు, పింగాణీ పాత్రలను పట్టుకునేందుకు కింది నుంచి స్టాండ్‌లా ఉండి తేలిగానగ పట్టుకునే బౌల్ క్యారియర్.. ఇలా అన్నీ కలిపి సెట్‌లా లభిస్తున్నాయి. వీటితో చేతులకు వేడి సెగ తగలదు, పాత్రలు బెసకవు.











## చెలి చిట్కా

ఇంట్లో ఈగలు రాకుండా వుండా లంటే ఇల్లు కడిగేటప్పుడు గచ్చుమీద కొంచెం పసుపుచల్లి కడిగితే ఈగలు రాకుండా ఉంటాయి.

# సోషల్ మీడియాతో ఆదాయం

సోషల్ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ మాత్రమే కాదు.. సంపాదన మార్గం కూడా! అందుకే చాలామంది అమ్మాయిలు ఇన్‌ఫ్లుయెన్సర్లుగా మారుతున్నారు. వ్యాపకంగా ప్రయత్నిసేనపర్లేదు కానీ.. ఆరోగ్యాన్నే పణంగా పెట్టట్లేదు కదా? మెలకువ రావడం ఆలస్యం.. చేయి ఫోన్ వైపు వెళ్తోందా? సమయం చూడటానికో, అలారం ఆపేయడానికో అయితే పర్లేదు. సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుకు ఎన్ని లైకులొచ్చాయి. ఎంతమంది చూశారంటూ కంగారుగా వెతికేస్తున్నారా? స్నేహితులదో, బంధువులదో ఒక ఫొటో లేదా వీడియో కళ్ల ముందు ప్రత్యక్షమవుతుంది. వాళ్ల ఆనందం మరింత బాధ పెంచేస్తున్నా.. నాకన్నా వాళ్లకే ఎందుకు గుర్తింపు వస్తోందంటూ అసహనం పెరిగిపోతోన్నా.. ఫోన్, ఇంటర్‌నెట్‌లు మీపై పెత్తనం చెలాయిస్తున్నాయనే అర్థం. ఎంత సమయం ? ... సోషల్ మీడియా ఒక తరహా వినోదమే. అది అంతవరకే పరిమితమవ్వాలి. ఇంతకీ రోజులో దానికి ఎంతసేపు కేటాయిస్తున్నారు? గంట, రెండు గంటలు? అంతకు మించుతున్నా.. దానిలో వచ్చే కామెంట్లూ, లైకులూ మీ భావోద్వేగాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నా.. మీరు సమస్యల్లో ఉన్నట్లే. ఎంటర్‌టైన్‌మెంట్ పరిధి దాటి జీవితంలో ఎక్కువ భాగం ఆక్రమిస్తోందంటే ఫోన్‌కి విరామం ప్రకటించాలనే

# పిల్లలకు నెబ్యులైజర్ ..

**సాధారణంగా చిన్న వయసులో పిల్లలు ఆడుకోవడానికి** వివిధ రకాల ఆట వస్తువులను తాకుతుంటారు. వీటి నుంచి సోకే క్రిముల కారణంగా జలుబు వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే వాతావరణంలో వచ్చే మార్పులు, కొత్తగా ఏదైనా ఆహార పదార్థాన్ని అలవాటు చేసినప్పుడు కూడా జలుబు చేయడం సహజం. జలుబు ఉన్నా కానీ సాధారణంగా ఆడుకుంటారు. ఎదుగుదలలో ఎలాంటి సమస్యా లేదు అంటే అది అలర్జీ వల్ల వచ్చిన జలుబుగా భావించాలి. ఇతర ఇన్ఫెక్షన్ల వల్ల జలుబు వచ్చినప్పుడు జ్వరం రావడం, సరిగా నిద్రపోకపోవడం.. వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. మొదటి రకం జలుబుకి అలర్జీకి సంబంధించిన మందులు వాడితే సరిపోతుంది. ఏదైనా ఇన్ఫెక్షన్ వల్ల జలుబు వచ్చినప్పుడు ఊపిరితిత్తుల్లో తెమడ చేరుతుంది. ఇలాంటప్పుడు శ్వాస తీసుకోవడానికి పిల్లలు ఇబ్బంది పడుతుంటారు. దానివల్ల వాంతులు చేసుకోవడం, నిద్రపట్టకపోవడం, ఆయాసపడడం.. వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాగే ఎక్కువసేపు ఏడుస్తుంటారు కూడా .ఇలాంటప్పుడు ఈ రకం నెబ్యులైజర్ వాడాల్సి ఉంటుంది. కానీ కొంతమంది ముక్కు దిబ్బడ తగ్గుతుందని జలుబు నుంచి వేగంగా ఉపశమనం పొందచ్చని సొంతంగానే నెబ్యులైజర్ వాడుతుంటారు. కానీ అది సరికాదు. డాక్టర్ సలహా మేరకు మాత్రమే నెబ్యులైజర్‌ని ఉపయోగించాలి. ఒకవేళ బాబుకి తరచుగా అలర్జీ సమస్య ఉంటే అత్యవసర సమయంలో నెబ్యులైజర్ వాడచ్చు. అయితే ప్రతిసారీ జలుబుకి నెబ్యులైజర్ ప్రత్యామ్నాయ చికిత్స కాదన్న విషయం మాత్రం గుర్తుపెట్టుకోండి.



# ఉల్లాసంగా, ఉత్సాహంగా..

**నేటి తరం మహిళలకు ఆరోగ్య స్పృహ ఎక్కువే.** నిత్యం ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండటానికి చేసే ప్రయత్నాలూ అనేకం. మరి అలా ఉండాలంటే డైట్ పరంగా ఏం చేయాలో తెలుసా. మనం తినే ఆహారమే మనల్ని నిర్ణయిస్తుందంటారు. అది అక్షర సత్యం. మనం ఎంత ఆహారం తీసుకుంటు న్నామనే దానిమీద అంటే అందులోని కెలోరీల పరిమాణంపై మనం జీవన కాలం ఆధారపడి ఉంటుందట. తక్కువ కెలోరీలు తీసుకునే వారిలో బ్రెయిన్ ఏజింగ్ ఆలస్యమవటమే కాకుండా వయసు పెరిగేకొద్దీ వచ్చే అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటివీ తొందరగా రాకుండా ఉంటాయి. దాంతో పాటు ఆరోగ్యం మెరుగుపడి ఆయుష్షు పెరుగుతుందని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే నీళ్లు ఎక్కువగా తాగటం, పంచదారతో తయారు చేసిన పదార్థాలకు దూరంగా ఉండటం, తక్కువ కార్బోహైడ్రేట్లూ ఎక్కువ ప్రొటీన్లూ ఉండే ఆహారాన్ని తీసుకోవటంతో పాటు నిత్యం వ్యాయామం చేయటం ద్వారా కెలోరీలనూ తగ్గించుకుంటే ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండొచ్చు



### పెళ్ళాడతానని మాట ఇచ్చి సహజీవనం
# చేసినంత మాత్రాన అత్యాచారంగా పరిగణించలేము

(ఉత్తరాఖండ్ హైకోర్టు (అట్ నైనిటాల్) తీర్పు)

**బద్వేలు లీగల్, మే 21 ప్రభాతవార్త:**
మేజర్లైన స్త్రీ, పురుషులు తమ అంగీకారంతో సుదీర్ఘకాలం పాటు సహజీవనం చేసిన అనంతరం పురుషుడు పెళ్ళాడతానని అంగీకరించిన మాత్రాన దానిని అత్యాచారంగా పరిగణించలేమని ఉత్తరాఖండ్ హైకోర్టు (అట్ నైనిటాల్) ధర్మాసనం తేల్చి చెప్పింది. వారి బంధం విఫలమైనంత మాత్రాన అది క్రిమినల్ కేసు కాదని ధర్మాసనం అభిప్రాయ పడింది. ఈ హామీ మొదటి నుండి అసత్యమని రూఢీ అయితేనే నేరమవుతుందని పేర్కొనింది. ఒక వ్యక్తి తనను పెళ్ళి చేసుకుంటానని నిమ్మించి అత్యాచారం చేశాడని ఆరోపిస్తూ ముస్సోరీకి చెందిన ఓ మహిళ వేసిన వ్యాజ్యమును ధర్మాసనం కొట్టివేసింది. సూరజ్ బోరా అనే వ్యక్తి 45 రోజులలో తనను వివాహం చేసుకుంటానని నమ్మబలికి తరువాత సహజీవనం చేస్తూనే తిరస్కరించాడని సదరు మహిళ ఫిర్యాదు చేయగా న్యాయమూర్తి జస్టిస్ ఆశిష్ నైధానీ విచారించి పూర్వాపరాలను పరిశీలించి "ఇద్దరూ మేజర్లని, నిందితుడు సంబంధం ప్రారంభం నుండీ మోసం చేసే ఉద్దేశ్యంతో ఉన్నట్లు నిరూపించడానికి ఖచ్చితమైన ఆధారాలు లేవు" అని అభిప్రాయపడ్డారు. "దీర్ఘకాలిక సంబంధం పరస్పర అంగీకారాన్ని సూచిస్తుంది. కనుక ఈ దశలో నిందితునిపై క్రిమినల్ చర్యలు కొనసాగించడం ఛేదించడమే అవుతుంది" అని సుస్పష్టం చేశారు. ఈ మేరకు 2023 వ సంవత్సరం జూలై నెల 22వ తేదీన దాఖలైన ఛార్జ్ షీట్‌ను కూడా పూర్తిగా కొట్టివేస్తూ తే. 11-2-2026 దీన ఉత్తరాఖండ్ హై కోర్టు(అట్ నైనిటాల్) ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. (శీర్షిక: క్రిమినల్ మిస్లేనియస్ అప్లికేషన్ నెం. 2082/2023, సూరజ్ బోరో ఎదిరి స్టేట్ అఫ్ ఉత్తరాఖండ్ ఇతరులు)

# ప్రజల కోసం ప్రతి క్షణం.. సమస్యల పరిష్కారమే లక్ష్యం

**పులివెందుల, మే 21, ప్రభాతవార్త :**
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు పారదర్శక, జవాబుదారీ పాలన అందిస్తోందని టీడీపీ నాయకుడు నియోజక వర్గ ఇన్చార్జి బీటెక్ రవి పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో ఆయన పాల్గొని నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు, వినతులను స్వయంగా స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను శ్రద్ధగా విన్న బీటెక్ రవి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి వేగవంతమైన సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా స్పందించాలని ఆయన సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని బీటెక్ రవి స్పష్టం చేశారు.


బీటెక్ రవికి సమస్యలు వివరిస్తున్న దృశ్యం

# పిఎండిఎస్ గుళికలను పంటపొలాలలో వెద జల్లడంతో అధిక లాభాలు





**ముద్దనూరు, మే 21 ప్రభాతవార్త:**
పంట పొలాలలో పిఎండిఎస్ విత్తన గుళికలను వర్షాకాలం కన్నా ముందే పంట పొలాలలో వెదజల్లడం వలన తక్కువ వర్షపాతంతోనే మొలకెత్తి భూమిని మొత్తం కప్పి ఉంచి నేలలోని సూక్ష్మ జీవులను రక్షించి సాగు చేసే ప్రధాన పంటకు అధికమేలను చేగురుస్తాయని ఎన్ఎఫ్ఏ మేరీ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నుజాహత్, ముని గోపాలుడు గురువారం నాడు రైతులకు అవగాహన కల్పించారు. బొందలకుంట ప్రకృతి వ్యవసాయ రైతు సునీల్ కుమార్ తన ఎక రా పొలంలో పిఎండిఎస్ విత్తన గుళికలను సిబ్బంది ఆధ్వర్యంలో వెదజల్లి, రైతులకు విత్తన గుళికలను తయారు చేయు విధానంపై పలు సూచనలు చేశా రు. ఈ కార్యక్రమంలో ఐ సి ఆర్ పి లు రమణయ్య, శ్రీదేవి, రాధిక, పుష్పా, యమునా, గంగా మహేశ్వరి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ : ఖాజా మోనద్దీన్

**వేంపల్లె మే 21 ప్రభాతవార్త**
వేంపల్లె మండల పరిధిలోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ముత్తుకూరు విలేజ్ హెల్త్ క్లినిక్‌ను జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిప్యూటీ డిఎంహెచ్ఓ) డాక్టర్: ఖాజా మోనద్దీన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్లినిక్‌లోని రికార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలను, మందుల నిల్వలను ఆయన అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు శాతాన్ని, విధులకు వారు సకాలంలో హాజరవుతున్నారా లేదా అనే విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజా మోనద్దీన్ మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దోమకాటు వలన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి ప్రమాదకరమైన వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, వీటి పట్ల ప్రజలు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరం, ఒంటి నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని హెల్త్ క్లినిక్ లేదా ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి ఉచితంగా వైద్య సేవలు పొందాలని ఆయన కోరారు. సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దోమల నివారణకు పంచాయతీ సిబ్బంది సహకారంతో యాంటీ లార్వా పిచికారీ చర్యలు ముమ్మరం చేస్తామని ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటించాలని, ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నాము అని, ప్రజలు దోమతెరాలు వాడాలి అని ప్రజల్లో అంటువ్యాధుల పట్ల అవగాహన కల్పించేందుకు వైద్య సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నరేష్, ఆరోగ్య కార్యకర్త నాగలక్ష్మి దేవి, పాల్గొన్నారు.



# స్వయం ఉపాధి సంఘం మహిళలకు కెవికెలో శిక్షణ

షెడ్యూల్ కులాల ఉపప్రణాళికలో పలు సూచనలు







**మైదుకూరు, మే 21, ప్రభాతవార్త:**
మైదుకూరు మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం నందు ఆదిరెడ్డిపల్లి మరియు బయనపల్లి, బద్వేల్ మండలానికి చెందిన షెడ్యూల్ కులాల స్వయం ఉపాధి సంఘం మహిళలకు వ్యవసాయ ఆధారిత విలువలు జోడింపు ఉత్పత్తులు సాంకేతిక పరిజ్ఞానం పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ కాంతి శ్రీ మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులైన చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు అలాగే ఉద్యాన ఉత్పత్తులు (పసుపు, మిరప) వాటిని పిండిగా మార్చి వాటి నుంచి వచ్చే వివిధ విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి అలాగే వీటి తయారీకి కావలసిన పిండి మర నిలువ చేయడానికి ప్యాకింగ్ కు వాడే యాంత్రికరణ, సాంకేతిక పరిజ్ఞానాన్ని గురించి క్లుప్తంగా వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ టి విజయనిర్మల, శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ శ్రీ విద్యా రాణి, శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ ఫిరోజ్ హుస్సేన్, వారు కెవికె ద్వారా నిర్వహించే వివిధ కార్యక్రమాలు క్షేత్రస్థాయి పరిశీలన ప్రథమ శ్రేణి ప్రదర్శనలు మొదలైన వాటి గురించి వివరించి కెవికే ద్వారా అందజేసే సేవలను ఉపయోగించుకోని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. తదుపరి ఎస్సీ ఉప ప్రణాళిక పథకం కింద స్వయం ఉపాధి సంఘం మహిళలకు పిండి మిల్లులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ మండలం మరియు మైదుకూరు మండలానికి చెందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### ఎల్ఎస్‌పీకి సంబంధించిన
# పనులను త్వరితగతిన చేపట్టాలి

: మంత్రి నారాలోకేష్‌కు విన్నవించిన ఎల్ఎస్‌పీ డ్యామ్ చైర్మన్

**బద్వేలు, మే 21 ప్రభాతవార్త :**
ఎల్ఎస్‌పీ డ్యాముకు సంబందించిన అనేక పనులు ప్రారంభం కాక నిర్మాణ దశలోనే ఉన్నాయని పనులను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎల్ఎస్‌పీ డ్యాము చైర్మన్ ఈగ వెంకటరమణారెడ్డి మంత్రి నారా లోకేష్‌కు విన్నవించారు. గురువారం మంత్రి నారాలోకేష్ కడపకు వచ్చిన సందర్భంగా ఎల్ఎస్‌పీ డ్యామ్ చైర్మన్ వెంకటరమణారెడ్డి కలిసి ఎల్ఎస్‌పీ డ్యాములో జరుగుతున్న పనుల స్థితిగతులను ఆయనకు వివరించారు. ఎల్ఎస్‌పీ డ్యామ్ ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువలో 200 క్యూ సెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యాన్ని 500 క్యూసెక్కులు పెంచుటకై 0 కిలో మీటరు నుంచి 23 కిలో మీటర్ వరకు కాలువ విస్తరణకు సంబంధించి సర్వే డిజైన్ మరియు భూ కందక తవ్వకాలు అలాగే బి.కోడూరు మరియు బద్వేలు మండలాలలో సీఎం అండ్ సీడి నిర్మాణ పనులు 80 లక్షల అంచనా వ్యయంతో మంజూరు చేయడం జరిగింది. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ 2021వ సంవత్సరంలో పనులు ప్రారంభించి కొంతమేర భూ కందక తవ్వకాలు మాత్రమే నిర్వహించారు. అయితే మిగిలిన నిర్మాణ పనులు ముఖ్యమైన సీఎంసీడి పనులు మరియు ఇతర అవసరమైన నిర్మాణ పనులు ఇప్పటివరకు చేపట్టలేదు. ఇంకా పెండింగ్ బిల్లుల విషయంలో కాంట్రాక్టర్‌కు ఇటీవల 18 కోట్లు విడుదల చేసినప్పటికీ ఇప్పటివరకు కాంట్రాక్టర్ పనులను తిరిగి ప్రారంభించలేదు. దీని ఫలితంగా ఎల్ఎస్‌పీ ప్రాజెక్టు పరిధిలో నియోజకవర్గంలోని 36 చెరువుల గొలుసులకు సరిపడా నీటి సరఫరా అందక 10వేల ఎకరాలు ఆయకట్టు సాగునీటి సౌకర్యం తీవ్రంగా దెబ్బతింటుంది. ఈ విధంగా రైతులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని నారా లోకేష్‌కు విన్నవించారు. అలాగే వేసవి కాలంలో తాగునీటి కొరత తీవ్రమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని బి.కోడూరు, బి.మఠం, బద్వేలు మండలాల ప్రజలపై తీవ్ర ప్రభావం ఏర్పడుతుందన్నారు.



ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత సంస్థకు చెందిన కాంట్రాక్టర్ పనులను పునఃప్రారంభించాలని త్వరితగతిన పూర్తి చేయాలని లేకపోతే నోటీసులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే టెండర్ రద్దు చేసి ఆ పనులను ఆ సంస్థనుంచి తొలగించాలని రీ టెండరు ప్రక్రియ చేపట్టాలని మంత్రి నారాలోకేష్‌కు ఎల్ఎస్‌పీ డ్యామ్ చైర్మన్ విన్నవించారు.

# మంత్రి లోకేష్‌ను కలిసి రితేష్‌రెడ్డి

**బద్వేలు, మే 21 ప్రభాతవార్త :**



కడప పర్యటన నిమిత్తం గురువారం ఎయిర్‌పోర్టుకు విచ్చే ఆయనకు బద్వేలు టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన మంత్రి నారా లోకేష్ మొదటిసారి కడపకు విచ్చేసిన సందర్భంగా నాయకులు ఘన స్వాగతం పలికారు. పార్టీ స్థితిగతులపై లోకేష్ దిశానిర్దేశం చేశారు. కూటమి అఖండ విజయం సాధించి కడపలో తిరుగులేని జెండా ఎగురవేసిన నాయకులందరినీ నారా లోకేష్ అభినందించినట్లు తెలుస్తోంది. టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి ఈ మధ్య కాలంలో చేసిన సేవా కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని మంత్రి నారా లోకేష్ అభినందించినట్లు సమాచారం. సమస్యలతో ప్రజలు నాయకుల వద్దకు వచ్చినపుడు వెంటనే వాటిని పరిష్కరించే దిశగా అడుగులు వే యాలని అప్పుడే పార్టీ పై ప్రజలకు నమ్మకం ఉంటుందని లోకేష్ వివరించారు. రితేష్‌రెడ్డి స్వాగతం పలకడంతో చిరునవ్వుతో రితేష్‌రెడ్డి ఆయన అభినందిం చారు. వారిద్దరి మధ్య నియోజకవర్గ పరిస్థితిపై సంభాషణ జరిగినట్లు తెలుస్తోంది.

### విద్యుత్ శాఖలో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న
## కాంట్రాక్ట్ కార్మికులతోనే ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి



**ప్రొద్దుటూరు అర్బన్ మే 21 ప్రభాతవార్త**
యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నాయబ్ రసూల్ మరియు జిల్లా అధ్యక్షులు బి.న్. నాగ సుబ్బయ్య ఒక సంయుక్త ప్రకటనలో మాట్లాడుతూ విద్యుత్ శాఖలో ఏళ్ల తరబడి చాలీచాలని జీతాలతో వేటి చాకిరీ చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న వారి సర్వీస్, విద్యా అర్హత ఉన్న వారిని తక్షణమే ఆ ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు ఈనెపాటి లెనిన్ బాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ లైన్మెన్ పోస్టులు మరియు జూనియర్ అసిస్టెంట్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే విద్యుత్ శాఖలో పనిచేస్తున్న అందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వారు తెలియజేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు అన్లిమిటెడ్ మెడికల్ పాలసీ వర్తింపజేయాలని అలాగే డిపార్ట్మెంటు వారు పని చేస్తున్న సబ్ స్టేషన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ మ్యానింగ్ ఇవ్వరాదని వారు డిమాండ్ చేసారు. ప్రొద్దుటూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎస్ మహబూబ్ షరీఫ్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని జూనియర్ లైన్మెన్ల పోస్టులను భర్తీ చేసి కార్మికులకు పని ఒత్తిడి తగ్గించాలని అలాగే విద్యుత్ శాఖలో 3 డిఏ లను వెంటనే విడుదల చేయాలని 2026 పిఆర్సిని వెంటనే ప్రకటించాలని వారు తెలియజేశారు.

## గోమాతను గౌరవిద్దాం, కాపాడుదాం

**రాజుపాళెం, మే 21, ప్రభాతవార్త:**



హిందువులు గోమాతను పూజిస్తారు ముస్లిం సోదరులు కూడా హిందువుల మనోభావాలను గౌరవిస్తూ బక్రీద్ పండుగకు ఖుర్బానీ పేరుతో గోవులను బలివ్వరాదని అందుకు మేకలు, గొర్రెలను ఇవ్వాలని ముస్లిం సోదరులను మండల బిజెపి అధ్యక్షుడు ముల్ల అస్మద్ కోరారు. హిందూ సోదరులు పూజించే గోమాతను గౌరవించడంతో పాటు వాటిని కాపాడి మత సామరస్యమును కాపాడడంతో పాటు హిందూ, ముస్లింల మధ్యన సోదర భావము ఐకమత్యములు నెలకొల్పుదామని ఆయన కోరారు.

## కల్లూరు గ్రామ శివారులో మహిళ మృతి

**ప్రొద్దుటూరు క్రైం, మే 21, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కల్లూరు గ్రామ శివార్లలో రమాదేవి(48) మృతి చెందారు. ఈమె డీహైడ్రేషన్ కారణంగా మృతి చెంది ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు కల్లూరు గ్రామానికి చెందిన రమాదేవి భర్త సుదర్శన్ మద్యానికి బానిసయ్యాడు. దీంతో అతను భార్యను సరిగా పట్టించుకునేవాడు కాదు. రమాదేవికి మతిస్తిమితం సరిగా ఉండేది కాదు. ఈ క్రమంలో ఈనెల 15న ఆమె ఇంటినుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. గతంలో పలుమార్లు ఇంటి నుంచి వెళ్లిన ఆమె 2, 3 రోజుల తరువాత తిరిగి వచ్చేది. ఇప్పుడు కూడా అలానే ఇంటికి వస్తుందని కుటుంబ సభ్యులు భావించారు. ఈ క్రమంలో గురువారం పంట పొలాలకు వెళ్లిన కొందరు గ్రామస్థులకు కంప చెట్ల నుంచి దుర్వాసన రావడంతో అక్కడికి వెళ్లి చూడగా మహిళ మృతదేహం కనిపించింది. దీంతో వారు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. వారి ద్వారా విషయం తెలుసుకున్న ఏఎస్పీ విభూకృష్ణ, రూరల్ సీఐ నాగభూషణ్, ఎస్సై రాజు ఘటనా స్థలానికి చేరుకొని మహిళ మృతదేహాన్ని పరిశీలించారు. ఎండ తీవ్రతకు వడదెబ్బ తగిలి మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.



### సెంట్రల్ కిచెన్ పేరుతో
# కార్మికుల పొట్టకొట్టొద్దు




**నందలూరు, మే 21 ప్రభాతవార్త :**
సెంట్రల్ కిచెన్ విధానాన్ని అమలు చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎ స్. చాంద్ భాష డిమాండ్ చేశారు. గురువారం నందలూరు జిల్లా పరిషత్ ఉ న్నత పాఠశాలలో నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 23 ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారని ఆయన తెలిపారు. జీతాలు పెరుగుతాయని, భవిష్యత్తు మెరుగుపడుతుందని ఆశిస్తున్న సమయంలో కా ర్మికులను తొలగించి ప్రైవేటు వ్యక్తులకు అవకాశం కల్పించే విధానాన్ని ప్రభు త్వం అనుసరించడం బాధాకరమన్నారు. కార్మికులను తొలగించకుండా జీతాలు పెంచుతామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని అమలు చేయా లని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10 వేల వేతనం, ఈ ఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జూన్ 10న కడప కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు కార్మికులంతా పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి పాలెం సాంబశివ, జిల్లా ఉపాధ్యక్షులు పి. ఆదినా రాయణ, నాయకులు వెంకటసుబ్బయ్య, బాలాజీ, శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్య క్షురాలు ఆదిలక్ష్మి, వెంకటమ్మ, బీబీ, లక్ష్మమ్మ, గాయత్రి, చెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలపై అభిమానాన్ని చాటుకున్న పూర్వ విద్యార్థిని

**నందలూరు, మే 21 ప్రభాతవార్త :**



శ్రీ అన్నమాచార్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ పూర్వ విద్యార్థిని తుమ్మాది గాయత్రి తన తల్లి దండ్రులతో కలిసి పాఠశాలకు ఇన్వర్టర్‌ను బహుమతిగా అందజేశారు. 2023, 24 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో 600కు 574 మార్కులు సాధించిన గాయత్రి, అనంతరం ఇంటర్మీడియట్‌లో 1000కు 989 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. తాను చదివిన పాఠశాలపై ఉన్న అభిమానంతో విద్యార్థుల సౌకర్యార్థం ఇన్వర్టర్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సమ్మెట శివప్రసాద్ మాట్లాడుతూ, గాయత్రి సేవాభావంతో ముందుకొచ్చి పాఠశాలకు సహాయం చేయడం అభినందనీయమన్నారు. ఆమె చర్య ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పాఠశాలకు ఇన్వర్టర్ అందజేసిన గాయత్రి కుటుంబ సభ్యులకు ప్రధానోపాధ్యాయుడు ఏనుగుల బాలాంజనేయులు, డైరెక్టర్లు మాడపూరి హేమలత, సమ్మెట ఉమా మహేష్, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

## దొంగ ఓట్లు తొలగించండి

**సిద్ధవటం, మే 21 ప్రభాతవార్త**



స్థానికేతురుల ఓట్లు తొలగింపు చేపట్టాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ప్రతినిధి శ్రీకాంత్ పేర్కొన్నారు మండలంలోని మాధవరం1 రామకృష్ణాపురం గ్రామంలోని తన నివాసంలో గురువారం ఆయన మాట్లాడుతూ మాధవరం గ్రామంలోని, 7 బూతుల్లో స్థానికేతురుల ఓట్లు పూర్తిగా తొలగించాలని అదేవిధంగా ఏ బూతు పరిధిలో నివాసం ఉన్న వారికి మాత్రమే ఓటు హక్కు కలిగించాలని తెలిపారు గత వైకాపా ప్రభుత్వంలో వైకాపా సానుభూతిపరుల ఓట్లు ఉన్నాయని వాళ్లంతా గ్రామంలో నివాసం లేరని ఎలక్షన్ రోజున చుట్టం చూపులా వచ్చి ఓట్లు వేసి వెళ్ళిపోతారని అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని గ్రామాల్లో ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకొని సానికేతురుల ఓట్లు తొలగింపుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## మంత్రి లోకేష్‌కు స్వాగతం పలికిన డిసిసి బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి

**బద్వేల్ అర్బన్, మే 21 (ప్రభాతవార్త):**
కడప జిల్లా పర్యటన నిమిత్తం విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కు కడప విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. కడప డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్య నారాయణ రెడ్డి మంత్రి లోకేష్‌కి పుష్పగుచ్చం అందజేసి సాదర స్వాగతం పలికారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించిన తర్వాత, అలాగే తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అత్యున్నత బాధ్యతలు చేపట్టిన అనంతరం నారా లోకేష్ తొలిసారి కడప జిల్లాకు విచ్చేయడంతో విమానాశ్రయం పరిసరాలు పండగ వాతావరణాన్ని తలపించాయి. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ వద్దకు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, పార్టీ శ్రేణులు, మరియు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తమ ప్రియతమ యువనేతకు అపూర్వ స్వాగతం పలుకుతూ విమానాశ్రయం వెలుపల అభిమానులు నినాదాలు చేశారు. ఈ కార్యక్ర మంలో జిల్లాకు చెందిన పలువురు ప్రముఖ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, మరియు కార్యకర్తలు పాల్గొని లోకేష్‌కి శుభాకాంక్షలు తెలియజేశారు.



# చదువుతో పాటు నైపుణ్యాలు కూడా అవసరం

**బద్వేలు అర్బన్, మే 21, ప్రభాతవార్త**
నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం డిగ్రీ సాధించడమే కాకుండా వివిధ రంగాల్లో నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ సూచించారు. బద్వేల్‌లోని శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ పీజీ కళాశాల (అటానమస్)లో గురువారం నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రపంచం ఎంతో విశాలమైందని, విద్యార్థులు తీసుకునే సరైన నిర్ణయాలే వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు. విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాల్లో ప్రావీణ్యం సంపాదించుకోవాలని సూచించారు. ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే ఆధునిక నైపుణ్యాలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ గ్రూప్ కమాండర్, ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్ తిరుపతి కల్నల్ గంగా సతీష్ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన జీవనశైలే ఉన్నత లక్ష్యాలకు దారి తీస్తుందని అన్నారు. అలాగే ఎంవిసి అకాడమీ హైదరాబాద్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ పి. రంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ట్రైనీ) పల్లెం శ్రీరామచంద్ర శ్రీనివాస్ గౌరవ అతిథులుగా పాల్గొని విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల పరిపాలన అధికారి రాచపూడి వెంకట సాయి కృష్ణ, డీన్ డాక్టర్ అశోక్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాల ఓబులేసు, పారామెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ షాహిన, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ గంగరాజు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా. రామ సుధ, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

